క్లుప్తంగా

నాగ పంచమి పూజలు



పూజల్లో పాల్గొన్న భక్తులు

సీతమ్మధార: శ్రావణ మాస మొదటి సోమవారం, నాగపంచమి సందర్భంగా 24వ వార్డు నక్కవానిపాలెం ఉమా నీలకంఠేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకుడు రామారావు శర్మ ఆధ్వర్యంలో భక్తుల గోత్రనామాలతో పూజలు చేశారు. ఆలయ ఆవరణలోని నాగదేవతలకు భక్తులు పాలు, పసుపు, కుంకుమతో పూజలు జరిపారు. ప్రత్యేక అలంకరణలో నీలకంఠేశ్వరుడు దర్శనమిచ్చారు. భక్తులకు ఆలయ సిబ్బంది తీర్థప్రసాదాలు అందించారు.

'స్పందన'కు 22 అర్జీలు



అర్జీలు స్వీకరిస్తున్న తహసీల్దార్ ఆనంద్‌కుమార్

సీతమ్మధార: సీతమ్మధార అర్బన్ తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమానికి 22 వినతులు అందాయి. అర్జీదారుల నుంచి వాటిని తహసీల్దార్, మండల ఎగ్జిక్యూటివ్ మేజిస్ట్రేట్ ఎం.ఆనంద్‌కుమార్ స్వీకరించి పరిశీలించారు. కుల, ఆదాయ, నివాస, కుటుంబ సభ్యత్వ సర్టిఫికెట్ల కోసం పలువురు దరఖాస్తు చేసుకున్నారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్, వీఆర్వోలు, సిబ్బంది పాల్గొన్నారు.

ఆక్రమణల తొలగింపు



నక్కవానిపాలెంలో ఆక్రమణలు తొలగిస్తున్న టౌన్ ప్లానింగ్ సిబ్బంది

సీతమ్మధార: జీవీఎంసీ 24వ వార్డు సత్యం జంక్షన్ నుంచి నక్కవానిపాలెం, అల్లూరి సీతారామరాజు కూడలితోపాటు హెచ్‌బీ కాలనీ వరకు పలు ఆక్రమణలను సోమవారం పట్టణ ప్రణాళిక విభాగం అధికారులు, సిబ్బంది తొలగించారు. జీవీఎంసీ కమిషనర్ ఆదేశాల మేరకు సీసీపీ నేతృత్వంలో ఏసీపీ ఆధ్వర్యంలో టీపీవో తేజ పర్యవేక్షణలో రోడ్డుపైకి ఉన్న భవన నిర్మాణాలు, రోడ్డు పక్కనే ఉన్న బడ్డీల, దుకాణాల తొలగింపు చర్యలు చేపట్టారు. అనుమతులు లేని ప్రకటన బోర్డులను తీసివేశారు. చైన్‌మేన్, సిబ్బంది పాల్గొన్నారు.

హనుమాన్ విగ్రహావిష్కరణ



హనుమంతవాక జంక్షన్‌లో విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న మేయర్ తదితరులు

ఏయూక్యాంపస్: హనుమంతవాక జంక్షన్ పేరు చిరస్థాయిగా నిలిచేలా మంచి కార్యక్రమాన్ని చేపట్టామని మేయర్ గొలగాని హరి వెంకటకుమారి తెలిపారు. 9వ వార్డు హనుమంతవాక జంక్షన్ వద్ద సుమారు 40 అడుగుల ఎత్తు గల హనుమంతుడి విగ్రహాన్ని వైఎస్సార్‌సీపీ తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త అక్కరమాని విజయనిర్మల, కార్పొరేటర్ కోరుకొండ వెంకటరత్న స్వాతితో కలసి మేయర్ సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మేయర్‌గా ప్రమాణ స్వీకారం చేసిన తర్వాత మొదటి కౌన్సిల్‌లో హనుమంతవాక జంక్షన్‌లో విగ్రహం ఏర్పాటుకు తీర్మానించామన్నారు. దాని ప్రకారం సుమారు రూ.60 లక్షలతో సంజీవ పర్వతంతో కూడిన హనుమాన్ విగ్రహం, వాటర్ ఫౌంటెన్, ఎల్‌ఈడీ లైట్లతోపాటు భక్తులకు ఆహ్లాదం కలిగించేలా ఆ ప్రాంతాన్ని అభివృద్ధి చేశామని చెప్పారు.

అభివృద్ధి జోరు



షాదీఖానా సమీపంలో నిర్మించిన సామాజిక భవనం

- ప్రగతిలో దూసుకుపోతున్న 44వ వార్డు
- రూ.7.73 కోట్లతో అనేక పనులు
- బీటీ, సీసీ రోడ్లు, డ్రెయిన్లు, సామాజిక భవనాల నిర్మాణాలు

సీతంపేట: ఉత్తర నియోజకవర్గంలో అభివృద్ధి పనులు జోరుగా జరుగుతున్నాయి. వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త, నెడ్‌క్యాప్ చైర్మన్ కె.కె.రాజు ఆధ్వర్యంలో ప్రతి వార్డు, సచివాలయ పరిధిలో నిర్వహిస్తున్న గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ద్వారా ప్రజల సమస్యలు తెలుసుకుని రోడ్లు, డ్రెయిన్లు, సామాజిక భవనాలు, కల్యాణ మండపాలు, ఆస్పత్రులు, పాఠశాలల్లో మౌలిక వసతులు, కొండవాలు ప్రాంతాల్లో రక్షణ చర్యలు ఇలా ఎన్నో అభివృద్ధి పనులు చేపట్టారు. ప్రతి వార్డును అభివృద్ధి పథంలో నడిపిస్తున్నారు. 44వ వార్డుకు సంబంధించి కార్పొరేటర్‌గా, జీవీఎంసీ ఫ్లోర్ లీడర్‌గా బాణాల శ్రీనివాసరావు ఎన్నికైన తర్వాత ఆ వార్డులో అభివృద్ధి పనులు ఊపందుకున్నాయి. గత రెండేళ్లలో వార్డులో సుమారు రూ.7.73 కోట్ల విలువైన పనులు జరిగాయి.

2021–22లో..

- గతేడాది వార్డులో రూ.2.26 కోట్లతో అభివృద్ధి పనులు నిర్వహించారు.
- ముస్లిం తాటిచెట్లపాలెం షాదీఖానా సమీపంలో రెండంతస్తుల సామాజిక భవనం నిర్మించారు.
- 80 ఫీట్ రోడ్‌లో శానిటరీ ఇన్‌స్పెక్టర్ కార్యాలయం పైన అదనంగా ఒక అంతస్తు నిర్మించి సామాజిక భవనానికి కేటాయించారు.
- శ్రామికనగర్‌లో రహదారి, డ్రెయిన్లు, శ్రీనివాసనగర్, ముస్లిం తాటిచెట్లపాలెం ప్రాంతాల్లో సీసీ డ్రెయిన్లు, ముస్లిం తాటిచెట్లపాలెం 238 సచివాలయం పరిధి మసీదు రోడ్డులో కల్వర్టు, రహదారి నిర్మాణం చేపట్టారు.
- ముస్లిం తాటిచెట్లపాలెం కమ్యూనిటీ హాల్‌లో మొదటి అంతస్తు నిర్మించారు.

2022–23లో..

- ఈ ఏడాది జనవరి నుంచి ఇప్పటి వరకు వార్డులో సుమారు రూ.4.94 కోట్ల అభివృద్ధి పనులు చేపట్టారు.
- రామచంద్రానగర్‌లో పలు అంతర్గత రహదారుల్లో బీటీ రోడ్లు వేశారు.
- 80 ఫీట్ రోడ్ నుంచి అబిద్‌నగర్ పార్కు, మాదేటి గార్డెన్స్‌కు.. ఎస్‌ఆర్ డీజీ స్కూల్ నుంచి అక్కయ్యపాలెం మెయిన్ రోడ్‌కు.. అబిద్‌నగర్ పార్కు చుట్టూ బీటీ రోడ్లు నిర్మించారు.
- శ్రామికనగర్, ఎంటీసీ పాలెంలోని కమ్యూనిటీ హాళ్లకు మరమ్మతులు, పెయింటింగ్ చేపట్టారు.
- రామచంద్రానగర్ గ్రీన్‌బెల్ట్ ప్రాంతంలో సీసీ రోడ్డు, వేణుగోపాల స్వామి ఆలయం వద్ద ఎస్‌డబ్ల్యూ డ్రెయిన్ నిర్మించారు.



మాదేటి గార్డెన్‌లో నిర్మించిన బీటీ రోడ్డు

- అక్కయ్యపాలెం మెయిన్ రోడ్ ఎన్‌జీజీవోస్ కార్యాలయం నుంచి రామచంద్రానగర్ గ్రీన్‌బెల్ట్ వరకు బీటీ రోడ్ వేశారు.
- 80 ఫీట్ రోడ్ రామచంద్రానగర్‌లో రహదారికి ఇరువైపులా, ఎస్‌ఆర్ డీజీ స్కూల్ నుంచి అక్కయ్యపాలెం మెయిన్ రోడ్ వరకు ఎస్‌డబ్ల్యూ డ్రెయిన్లు, మాదేటి గార్డెన్స్‌లో సీసీ డ్రెయిన్లు నిర్మించారు.
- గడప గడపకు మన ప్రభుత్వం ద్వారా మంజూరైన రూ.38.76 లక్షల నిధులతో ఎంటీసీ పాలెంలో అంతర్గత రహదారులు, సీసీ డ్రెయిన్లు, శ్రీనివాసనగర్‌లో సిద్ధి గణపతి ఆలయం వద్ద సీసీ రోడ్డు నిర్మించారు.

మరో రూ.2 కోట్లతో..

మరో రూ.2 కోట్ల విలువైన అభివృద్ధి పనులు టెండర్ దశలో ఉన్నాయి. ఈ నిధులతో ఎంటీసీ పాలెం, రామచంద్రానగర్, అబిద్‌నగర్, మాదేటి గార్డెన్స్ ప్రాంతాల్లో బీటీ రోడ్లు, సీసీ డ్రెయిన్ల నిర్మాణం, గెడ్డ మరమ్మతులు చేపట్టనున్నారు.

పూర్తి స్థాయిలో అభివృద్ధి



ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి సుపరిపాలనలో సంక్షేమం, అభివృద్ధికి పెద్దపీట వేశారు. 44వ వార్డులో గడిచిన రెండేళ్లలో రూ.7.73 కోట్ల విలువైన అభివృద్ధి పనులు పూర్తి స్థాయిలో చేపట్టాం. ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యలు తెలుసుకుంటూ, గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో తమ దృష్టికి వచ్చిన సమస్యల ప్రాధాన్యాన్ని అనుసరించి అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం.

– బాణాల శ్రీనివాసరావు, జీవీఎంసీ ఫ్లోర్ లీడర్, 44వ వార్డు కార్పొరేటర్

ప్రజల మనిషి సీఎం జగన్

- పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలు
- వైఎస్సార్‌సీపీ 'ఉత్తర' సమన్వయకర్త కె.కె.రాజు
- 24వ వార్డులో 'గడప గడపకు మన ప్రభుత్వం'



సంక్షేమ పథకాల కరపత్రం అందిస్తున్న కె.కె.రాజు, కార్పొరేటర్ పద్మారెడ్డి

సీతమ్మధార: 'సంక్షేమ సారధి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజల మనిషి' అని నెడ్‌క్యాప్ చైర్మన్, వైఎస్సార్‌సీపీ ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త కె.కె.రాజు కొనియాడారు. 24వ వార్డు గాంధీనగర్–2, సచివాలయం(1086124) సీతమ్మధార, టీపీటీ కాలనీ ప్రాంతాల్లో రెండో రోజు సోమవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం కొనసాగింది. కార్పొరేటర్ సాడి పద్మారెడ్డితో కలిసి ఆయన ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాల లబ్ధిని వివరించి, కరపత్రాలు అందజేశారు. నివాసుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కె.కె.రాజు మాట్లాడుతూ పార్టీలకు అతీతంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించిన ప్రజా నాయకుడు జగనన్న అని పేర్కొన్నారు. దేశంలోని ఏ నాయకుడు చేయని విధంగా ఆయన పాదయాత్ర చేశారన్నారు. ప్రజల ఆశీస్సులతో సీఎం వైఎస్ జగన్ పాలన అద్భుతంగా సాగుతోందని చెప్పారు. సంక్షేమ పథకాలను అడ్డుకోవడమే ప్రతిపక్ష నేత చంద్రబాబు పని అని, ఎన్ని కుట్రలు చేసినా అభివృద్ధిని ఆపలేరన్నారు. ప్రతి విషయానికి వ్యవస్థలను మేనేజ్ చేయడం ఆయన పనిగా పెట్టుకున్నారని విమర్శించారు. అన్ని ప్రాంతాలను అభివృద్ధి చేయడమే ధ్యేయంగా ముఖ్యమంత్రి జగన్ పనిచేస్తున్నారన్నారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు, సచివాలయ కన్వీనర్లు, గ్రామ పెద్దలు, గృహసారథులు, వలంటీర్లు, జీవీఎంసీ అధికారులు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

అంతర్ కళాశాలల ప్రతిభా పోటీలు రేపు



ప్రతిభా పోటీల పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ప్రిన్సిపాల్ సిస్టర్ షైజీ తదితరులు

కంచరపాలెం: జ్ఞానాపురం సెయింట్ జోసెఫ్ మహిళా కళాశాలలో ఈ నెల 23న అంతర్ కళాశాలల ప్రతిభా పోటీలు నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ సిస్టర్ షైజీ, ద్వితీయ భాషా విభాగం అధ్యక్షురాలు డాక్టర్ పి.కె.జయలక్ష్మి తెలిపారు. సోమవారం కళాశాల ఆవరణలో పోటీల పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థుల్లో భావవ్యక్తీకరణ కౌశలం, ప్రతిభా పాటవాలను ప్రోత్సహించే ఉద్దేశంతో రెండేళ్లుగా ఈ పోటీలు ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. విశాఖలోని అనేక డిగ్రీ కళాశాలల విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొంటారన్నారు. వక్తృత్వం, చిత్రలేఖనం, గీతాలాపన, వ్యాసరచన, కథలు తదితర విభాగాల్లో తెలుగు, హిందీ, ఆంగ్ల మాధ్యమాల్లో పోటీలు నిర్వహిస్తామని, విజేతలకు జ్ఞాపికలు, ప్రమాణ పత్రాలు అందిస్తామన్నారు. బుధవారం మధ్యాహ్నం 12 గంటలకు పోటీలు ప్రారంభమవుతాయని జయలక్ష్మి తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ నిర్మల, డాక్టర్ దీప్తి, సిస్టర్ జైన్, కోటేశ్వరరావు, గౌరీనాయుడు, విద్యార్థినులు పాల్గొన్నారు.

సీతారామాలయానికి వితరణ, విరాళం



మకరతోరణాన్ని ఊరేగిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు, దాతలు



రూ.50 వేల విరాళం అందిస్తున్న కార్పొరేటర్ ఆళ్ల లీలావతి, శ్రీనివాస్ దంపతులు

తాటిచెట్లపాలెం: జీవీఎంసీ 55వ వార్డు తాటిచెట్లపాలెం రెడ్డివీధిలోని రామబాలభక్త సమాజం(సీతారామాలయం)లో సోమవారం ప్రత్యేక కార్యక్రమాలు, లలితా సహస్ర నామ పూజలు చేశారు. ఈ సందర్భంగా తాటిచెట్లపాలేనికి చెందిన సదరం అప్పారావు, లక్ష్మీభాయి దంపతులు, కుటుంబ సభ్యులు ఆలయంలోని విగ్రహాలకు కిరీటాలు, మకరతోరణం బహూకరించారు. వీటిని పురవీధుల్లో ఊరేగించి, పూజలు చేసిన అనంతరం విగ్రహాలకు ధరింపజేశారు. అనంతరం జరిగిన పూజా కార్యక్రమాల్లో 42వ వార్డు కార్పొరేటర్ ఆళ్ల లీలావతి, వైఎస్సార్‌సీపీ నాయకుడు ఆళ్ల శ్రీనివాసరావు దంపతులు పాల్గొన్నారు. ఆలయానికి అవసరమైన స్టీల్ గేట్ల ఏర్పాటుకు ఆళ్ల శ్రీనివాస్ తన తల్లిదండ్రుల పేరు మీద రూ.80 వేల విరాళం ప్రకటించారని, ముందుగా రూ.50 వేలను కమిటీ సభ్యులకు అందించారని ఆలయ అధ్యక్షుడు నూనెల పోలారావు యాదవ్ తెలిపారు. ఆలయ పునర్నిర్మాణానికి కూడా ఆళ్ల లీలావతి, శ్రీనివాస్ దంపతులు 150 బస్తాల సిమెంటును అందజేశారన్నారు. ఆలయ పునర్నిర్మాణంలో ఎదురైన ఇబ్బందులను వీరు వైఎస్సార్‌సీపీ ఉత్తర సమన్వయకర్త కె.కె.రాజు దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించారని చెప్పారు. ఆయనకు కమిటీ సభ్యులు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ గౌరవ అధ్యక్షుడు బోర నరసింగరావురెడ్డి, కార్యదర్శి బోర వరశంకరరెడ్డి, కోశాధికారి నంబాల వెంకటేశ్వరరావు యాదవ్, ఆడిటర్ జాగారపు ప్రకాష్, అధిక సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.

మేడ పైనుంచి జారిపడిన బాలుడి మృతి

సీతమ్మధార: మేడపై ఆడుకుంటూ అదుపు తప్పి కిందపడిన బాలుడు మృతి చెందిన ఘటన ఫోర్త్ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాలిలా.. అక్కయ్యపాలెం అబిద్‌నగర్ మసీద్ దరి తండ్రి రామారావు, తల్లి అరుణ, కుమారుడు ధక్షిక్(9) నివసిస్తున్నారు. శ్రీకాకుళం జిల్లా లావేరు గ్రామం నుంచి పనుల నిమిత్తం ఇక్కడికి వచ్చి ఉంటున్నారు. జ్ఞాన నికేతన్ స్కూల్‌లో ధక్షిక్ నాలుగో తరగతి చదువుతున్నాడు. ఆదివారం మధ్యాహ్నం మేడపై ఆడుకుంటూ కాలు జారి కింద పడిపోవడంతో ధక్షిక్ తలకు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే బాలుడిని తల్లిదండ్రులు కేజీహెచ్‌కు తీసుకెళ్లారు. చికిత్స పొందుతూ సోమవారం ఉదయం బాబు మృతిచెందాడు. తండ్రి రామారావు ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ గౌరి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు లేని ఇంటికి ప్లాన్ మంజూరు



జీవీఎంసీ స్పందనలో ఫిర్యాదు చేస్తున్న పీలా వెంకటలక్ష్మి, పోతు సత్యనారాయణ

సీతంపేట: రహదారి లేకుండా బహుళ అంతస్తు నిర్మాణానికి ఎలా ప్లాన్ మంజూరు చేశారని, తక్షణమే ఇంటి నిర్మాణాన్ని ఆపేసి తగు చర్యలు చేపట్టాలని వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం జోనల్ ఇన్‌చార్జి పీలా వెంకటలక్ష్మి, సీనియర్ నాయకుడు పోతు సత్యనారాయణ సోమవారం జీవీఎంసీ స్పందన కార్యక్రమంలో ఏడీసీ శ్రీనివాసరావుకు ఫిర్యాదు చేశారు. 26వ వార్డు రామకృష్ణానగర్‌లోని ఇంటి నంబర్ 49–2–44/1లో తప్పుడు సర్వే నంబర్లతో జీవీఎంసీ నుంచి 1086/6325/బీ/జెడ్3/ఎల్‌ఏఆర్/2022 బీపీ నంబర్‌తో ప్లాన్ పొందారని ఫిర్యాదులో పేర్కొన్నారు. నిర్మిస్తున్న ఇంటి ముందు ఎటువంటి రోడ్డు లేదని, గెడ్డ బఫర్ జోన్‌లో రాకపోకలు సాగించాల్సిన పరిస్థితి ఉందన్నారు. 20 అడుగుల రహదారి(ఎగ్జిస్టింగ్) ఉన్నట్టు, భవిష్యత్ అవసరాల కోసం మరో 10 అడుగుల రోడ్డు విడిచిపెట్టినట్టు ప్లాన్‌లో చూపించారని, కనీసం ఒక్క అడుగు కూడా రోడ్డు లేకుండా ఎలా ప్లాన్ మంజూరు చేశారన్నారు. ఈ అక్రమ నిర్మాణాన్ని అధికారులు పరిశీలించి తగు చర్యలు చేపట్టాలని వారు కోరారు.

ఉపాధి కార్యాలయంలో జాబ్‌మేళా రేపు

కంచరపాలెం: కంచరపాలెం జిల్లా ఉపాధి కార్యాలయంలోని నేషనల్ కెరీర్ సర్వీస్ సెంటర్‌లో ఈ నెల 23న జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు జిల్లా సబ్ రీజినల్ ఎంప్లాయిమెంట్ అధికారి నిట్టాల శ్యామ్‌సుందర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఒన్ కమ్యూనికేషన్ లిమిటెడ్(పేటీఎం) కంపెనీలో 199 ఉద్యోగాల భర్తీకి ఇంటర్వ్యూలు జరుగుతాయన్నారు. ఫీల్డ్ సేల్స్ ఎగ్జిక్యూటివ్ ఉద్యోగాలకు ఎస్‌ఎస్‌సీ(టెన్త్), ఇంటర్మీడియట్, ఏదైనా డిగ్రీ ఉత్తీర్ణత, 18–35 ఏళ్ల వయసు గల పురుష, మహిళా అభ్యర్థులు అర్హులని చెప్పారు. ఉద్యోగాన్ని బట్టి జీతం నెలకు రూ.21,000 నుంచి రూ.25,000 వరకు ఉంటుందన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు ncs.gov.in వెబ్‌సైట్‌లో తమ పేర్లు రిజిస్టర్ చేసుకోవాలని సూచించారు. బుధవారం ఉదయం 10 గంటలకు జాబ్‌మేళాకు హాజరు కావాలని కోరారు.

30న దత్తాత్రేయుని విగ్రహ ప్రతిష్ట

సీతమ్మధార: నక్కవానిపాలెం ఉమా నీలకంఠేశ్వర స్వామి ఆలయంలో ఈ నెల 30న దత్తాత్రేయుడి విగ్రహాన్ని, షిర్డీసాయిబాబాకు పాదుకలు ప్రతిష్ట చేస్తున్నట్లు అర్చకుడు రామారావు శర్మ తెలిపారు. బుధవారం ఉదయం 10 గంటలకు విగ్రహ ప్రతిష్ట జరుగుతుందన్నారు. 28వ తేదీ సోమవారం సాయంత్రం 8 గంటలకు ఆలయంలో లక్ష ఒత్తులతో దీపారాధన నిర్వహిస్తున్నట్లు చెప్పారు.

బాలిక అదృశ్యం



జెన్నిఫర్ షైనీ

మర్రిపాలెం: ఓ బాలిక అదృశ్యమైన ఘటన కంచరపాలెం ఐదో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల తెలిపిన వివరాలిలా.. జెన్నిఫర్ షైనీ(11) అనే బాలిక తల్లిదండ్రులతో కలిసి ఆర్ అండ్ బీ జంక్షన్ దరి అంబేడ్కర్ కాలనీలో నివసిస్తోంది. తండ్రి రిచర్డ్ డానియల్ ఎలక్ట్రీషియన్‌గా పని చేస్తున్నాడు. ఈ బాలిక జ్ఞానాపురంలోని సెయింట్ జోసెఫ్ స్కూల్‌లో 6వ తరగతి చదువుతోంది. రోజూ మాదిరిగానే సోమవారం స్కూల్‌కు ఆటోలో వెళ్లింది. మధ్యాహ్నం 3.30 గంటలకు స్కూల్ అయిపోగా ఎంతసేపటికి ఆ బాలిక రాకపోవడంతో ఆటో డ్రైవర్ విద్యార్థిని తల్లికి ఫోన్ చేసి తెలియజేశాడు. ఆమె స్కూల్‌కు చేరుకుని యాజమాన్యాన్ని అడిగారు. స్కూల్ బ్యాగ్ బయట పడేసి ఉంది. ఎన్నిచోట్ల వెతికినా ఫలితం లేకపోవడంతో సోమవారం రాత్రి షైనీ తల్లి రూబి కంచరపాలెం పోలీసులకు ఫిర్యాదు చేశారు. సీఐ ఎస్.సాయి నేతృత్వంలో కేసు నమోదు చేసి బృందాలుగా ఏర్పడి కంట్రోల్ రూమ్‌లో, బయట అన్ని చోట్ల బాలిక కోసం గాలిస్తున్నారు.

ఆహ్లాదం.. ఆకర్షణీయం



ట్రెకింగ్ వాల్ ఎక్కుతున్న చిన్నారులు



లాసన్స్ బే పార్కులో పిల్లల ఆటలను వీక్షిస్తున్న మేయర్ హరివెంకటకుమారి(ఫైల్)

- లాసన్స్ బే పార్కుకు పెరుగుతున్న సందర్శకులు
- పాత టైర్లతో క్రీడా ప్రాంగణాల ఏర్పాటు
- జీవీఎంసీ చర్యలపై సర్వత్రా హర్షం

ఎంవీపీకాలనీ: సాగర తీరాన్ని ఆనుకొని ఉన్న లాసన్స్ బే కాలనీ పార్కును జీవీఎంసీ ఆధునికీకరించిన విధానంపై సర్వత్రా ప్రశంసలు లభిస్తున్నాయి. వేస్ట్ టు వండర్స్ పేరిట జీవీఎంసీ గత జూలైలో ఈ పార్కును అభివృద్ధి చేసిన విషయం తెలిసిందే. ఇందులో భాగంగా నిరుపయోగంగా పడి ఉన్న పాత టైర్లకు కొత్త హంగులు అద్ది ఈ పార్కులో క్రీడా ప్రాంగణాలను తీర్చిదిద్దింది. దీంతో అవి పిల్లలకు అత్యంత థ్రిల్లింగ్ ఎక్స్‌పీరియన్స్‌ను ఇస్తున్నాయి. కొంతకాలంగా ఈ పార్కుకు వచ్చే సందర్శకులతోపాటు పిల్లల సంఖ్య గణనీయంగా పెరుగుతోంది. పిల్లలంతా సరదాగా ఆడుతూ ఎంజాయ్ చేస్తున్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా ఈ పార్కును వినూత్నంగా మార్చడంతో అందరూ ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

వ్యర్థాలతో వినూత్నంగా..

నగర ప్రజలకు ఆహ్లాదాన్ని అందించడంలో భాగంగా జీవీఎంసీ పలు పార్కులను ఆధునికీకరిస్తోంది. ఇందులో భాగంగా జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ సూచనల మేరకు వేస్ట్ టు వండర్స్ కాన్సెప్ట్‌తో లాసన్స్ బే పార్కును వినూత్నంగా తీర్చిదిద్దారు. స్వచ్ఛ సర్వేక్షణ్ ద్వారా సేకరించిన వ్యర్థాలు, టైర్లను వినియోగించి అన్ని వయసుల వారికి ఆహ్లాదం.. ఆనందం పంచేలా ఈ పార్కులో క్రీడా ప్రాంగణాలను రూపొందించారు. రూ.16.5 లక్షల ఖర్చుతో ఈ ప్రాంగణాలు రూపుదిద్దుకున్నాయి. ఇందు కోసం 1900 కేజీల పనికిరాని టైర్లను వినియోగించారు. వాటికి సరికొత్త రంగులు అద్ది జారుడు బల్లలు, ట్రెకింగ్ వాల్స్, ఎడ్వెంచర్ ఏరియా, ఊయలతోపాటు పలు రకాల క్రీడాకృతులను రూపొందించారు. ప్రస్తుతం ఇవి అందరినీ ఆకర్షిస్తూ ఆహ్లాదాన్ని పంచుతున్నాయి.

వార్డుల్లో సమస్యల పరిష్కారానికి చర్యలు

- జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ
- కొండవాలు ప్రాంతాల్లో ఆకస్మిక పర్యటన



47వ వార్డులో పర్యటిస్తున్న కమిషనర్ సాయికాంత్ వర్మ, కార్పొరేటర్ కామేశ్వరి



46వ వార్డులో జీవీఎంసీ కమిషనర్‌కు సమస్యలు వివరిస్తున్న డిప్యూటీ మేయర్ కటుమూరి సతీష్

కంచరపాలెం: వార్డుల్లోని సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నట్లు జీవీఎంసీ కమిషనర్ సి.ఎం.సాయికాంత్ వర్మ తెలిపారు. 46, 47 వార్డుల్లోని కొండవాలు ప్రాంతాల్లో సోమవారం ఆయన ఆకస్మికంగా పర్యటించారు. కైలాసపురం, కస్తూరినగర్, శాంతినగర్, రాంజీ ఎస్టేట్, కప్పరాడ ప్రాంతాల్లో జీవీఎంసీ డిప్యూటీ మేయర్ కటుమూరి సతీష్, స్టాండింగ్ కమిటీ సభ్యురాలు, కార్పొరేటర్ కంటిపాము కామేశ్వరిలతో కలిసి సమస్యలను పరిశీలించారు. ఆయన దృష్టికి పలు ప్రధాన సమస్యలను తీసుకెళ్లారు. ప్రజలకు 24/7 తాగునీరు అందించాలని, శిథిలమైన కాలువలు, రోడ్లకు మరమ్మతులు చేపట్టాలని, కస్తూరినగర్ నుంచి జాతీయ రహదారి వరకు ప్రధాన గెడ్డను ఆధునీకీకరించాలని, పోర్ట్ క్వార్టర్స్‌లో అసాంఘిక కార్యకలాపాల కట్టడికి పోర్ట్ అధికారులతో మాట్లాడి నిఘా ఏర్పాటు చేయించాలని, తాటిచెట్లపాలెం నుంచి కైలాసపురం వరకు రోడ్లు, ఫుట్‌పాత్‌లు, కాలువలు నిర్మించాలని కోరుతూ జీవీఎంసీ కమిషనర్‌కు డిప్యూటీ మేయర్ సతీష్ వినతిపత్రం అందించారు.

పెదకొత్తూరు, కప్పరాడ, రాంజీ ఎస్టేట్ కొండవాలు ప్రాంతాల్లో తాగునీటి పైపుల ఏర్పాటు పనుల అనంతరం సక్రమంగా గోతులు పూడ్చకపోవడంతో స్థానికులు ఇబ్బంది పడుతున్నారని జీవీఎంసీ కమిషనర్‌కు కార్పొరేటర్ కామేశ్వరి వివరించారు. ఈ సమస్యలపై సాయికాంత్ వర్మ స్పందిస్తూ.. యుద్ధప్రాతిపదికన పనులు చేపట్టాలని అధికారులను ఆదేశించారు.

పర్యటనలో పట్టణ ప్రణాళిక అధికారి సునీత, ప్రధాన వైద్యాధికారి నరేష్‌కుమార్, జోన్–5 కమిషనర్ ఆర్.జి.వి.కృష్ణ, పర్యవేక్షణ ఇంజినీర్ వేణుగోపాల్, కార్యనిర్వాహక ఇంజినీర్ శ్రీనివాస్, ఏఎంహెచ్‌వో డాక్టర్ సునీల్‌కుమార్, వైఎస్సార్‌సీపీ నాయకులు, సచివాలయ సిబ్బంది, కన్వీనర్లు, వలంటీర్లు పాల్గొన్నారు.

రేపటి నుంచి తెలుగు భాషా వారోత్సవాలు

ఏయూ క్యాంపస్: తెలుగు భాషా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆంధ్ర విశ్వకళాపరిషత్, తెలుగు విభాగం ఆధ్వర్యంలో ఈ నెల 23 నుంచి తెలుగు భాషా వారోత్సవాలు నిర్వహించనున్నట్లు తెలుగు శాఖాధిపతి ఆచార్య జర్ర అప్పారావు తెలిపారు. ఆగస్టు 29న కళాప్రపూర్ణ గిడుగు రామమూర్తి పంతులు జయంతిని పురస్కరించుకుని బుధవారం నుంచి 29 వరకు రోజూ మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఈ వారోత్సవాలు నిర్వహిస్తామన్నారు. దీనిలో భాగంగా నగరంలోని వివిధ కళాశాలల విద్యార్థులను భాగస్వాములను చేస్తూ వివిధ మేథోపోటీలను నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. 23న వ్యాసరచన పోటీలు, 24న వక్తృత్వ పోటీలు, 25న పద్యపఠనం, 26న తెలుగు భాషా సాహిత్యాలపై క్విజ్, 27న నిష్ణాతులైన భాషా సాహిత్యవేత్తలతో చర్చాగోష్టి, 28న సోమవారం గిడుగు రామమూర్తి రచనలపై ఉపన్యాసాలు, 29న ముగింపు కార్యక్రమం ఉంటాయని తెలియజేశారు. ముగింపు వేడుకలకు ముఖ్యఅతిథిగా ఆర్ట్స్, కామర్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య ఎ.నరసింహారావు, విశిష్ట అతిథులుగా ఆచార్య వెలమల సిమ్మన్న, ఆచార్య జి.యోహాన్ బాబు, ఆత్మీయ అతిథులుగా డాక్టర్ డి.వి సూర్యారావు, పరవస్తు ఫణిశయనసూరి హాజరవుతారని వివరించారు.